## క్లుప్తంగా

### కార్తికేయునికి ప్రత్యేక పూజలు


బయ్యన్నగూడెం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నసమారాధన

కొయ్యలగూడెం: బయ్యనగూడెం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రం కృత్తికా నక్షత్రం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కొత్తలంక శివ సత్యనారాయణ చార్యులు, ప్రసాదాచార్యుల పర్యవేక్షణలో భక్తులచే సామూహిక పూజలు జరిపించారు. అనంతరం దాతల సహకారంతో వెయ్యి మందికి పైగా భక్తులకు అన్న సమారాధన చేశారు. వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, సర్పంచ్ లింగిశెట్టి అనంతలక్ష్మి, ఉప సర్పంచ్ కోరుకొండ లలిత ఏర్పాట్లను పర్యవేక్షించారు. కొయ్యలగూడెం టెంపుల్స్ సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు గుడిపూడి శేషాచార్యుల ఆధ్వర్యంలో గులాబీలతో స్వామివారికి అర్చన చేశారు.

### విద్యాసామగ్రి పంపిణీ


విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న మానవత సంస్థ సభ్యులు

కొయ్యలగూడెం: స్థానిక తొమ్మిదవ వార్డు మండల పరిషత్ పాఠశాలల్లోని విద్యార్థులకు మంగళవారం మానవత సంస్థ అధ్యక్షుడు మాటూరి సుధీర్, ప్రధాన కార్యదర్శి కంభంపాటి సాయికృష్ణ ఆధ్వర్యంలో రూ.6 వేల విలువైన విద్యాసామగ్రి పంపిణీ చేశారు. సీనియర్ సభ్యులు ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మానవతా విద్య కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో కావాల్సిన వనరులను గుర్తించి సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ఎంఈఓ జె.సురేష్‌బాబు, సభ్యులు ఎస్‌బీజీ శేఖర్, గద్దె రామ్మోహన్, బొమ్మ మోహన్‌రావు, డాక్టర్ చంటి, సత్యనారాయణ గుప్తా, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

### జీలకర్రగూడెంలో హిందూధర్మ ప్రచారం


హిందూ ధర్మ ప్రచారం నిర్వహిస్తున్న భజన కళాకారులు

కామవరపుకోట: అన్నమయ్య జానపద వృత్తి భజన కళాకారుల రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం జీలకర్రగూడెం గ్రామంలో ఇంటింటికీ హిందూ ధర్మ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు పులిమామిడి యాదగిరి, జీలకర్రగూడెం రాజవంశీయులు ఎస్ఆర్ఆర్.రామకృష్ణంరాజు సమక్షంలో, అర్చకులు పెద్ద తిరుపతి నుంచి తీసుకువచ్చిన వేంకటేశ్వరస్వామి కల్యాణపు అక్షింతలు, రూపాయి నాణెం, గోవింద నామాలు, విష్ణు సహస్రనామాల పుస్తకాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటింటికి అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కూచింపూడి కృష్ణ, మండల అధ్యక్షుడు పామర్తి రామ కోటేశ్వరరావు, కేతిరెడ్డి రాజకుమారి పాల్గొన్నారు.

### ఏపీపై కేంద్రానికి చిన్నచూపు


మాట్లాడుతున్న మండల కన్వీనర్ శ్రీనివాసరావు

కొయ్యలగూడెం: ఆంధ్రప్రదేశ్‌ను కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని సీపీఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు మండిపడ్డారు. కన్నాపురం రోడ్డులోని పార్టీ కార్యాలయంలో టౌన్ కన్వీనర్ ఎస్‌కే బాజీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రూ.15 వేల కోట్లు అప్పుగానే ఇచ్చిందనే విషయం బీజేపీ పెద్దలు పేర్కొనడంతో అసలు విషయం బయటపడిందని అన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి అభివృద్ధి నిధులపై నోరు విప్పకపోగా అప్పుగా ఇచ్చిన వాటి గురించి బడాయిగా ప్రచారం చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్ట్ ఎప్పుడు పూర్తి చేస్తారనేది కూడా స్పష్టంగా బడ్జెట్లో పేర్కొనలేదన్నారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల నారాయణరావు, వెలగల నాని, ఎస్.గిరి, మట్ట రామకృష్ణ, వెలగల రామారావు పాల్గొన్నారు.

### మలాథియాన్ స్ప్రేయింగ్

టి.నరసాపురం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, ఎక్కడా నీటి నిల్వలు లేకుండా చూడాలని సర్పంచ్ మోదుగు సునంద గ్రామస్తులకు సూచించారు. పుట్రేపు గ్రామంలో దోమల నివారణకు మలాథియాన్ స్ప్రేయింగ్ మంగళవారం నిర్వహించారు. ఎంపీడీవో కె.జోగేశ్వరరావు ఆదేశాలమేరకు దోమల నివారణ మందును ట్రాక్టర్ ద్వారా స్ప్రే చేస్తున్నట్లు కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# తక్షణ సాయానికి కొర్రీలు

- రూ.3 వేల తక్షణ వరద సాయానికి అడ్డగోలు నిబంధనలు
- రేషన్ కార్డు ఉంటేనే పరిహారం అందజేత
- సర్వం కోల్పోయి అల్లాడుతున్న పేదలు
- వరద నష్టానికితోడు అధికార్ల పేచీలపై ఆగ్రహావేశాలు


పెద్దవాగు వల్ల కకావికలమైన అల్లూరినగర్ గ్రామం


కూలిపోయిన ఓ ఇల్లు

వేలేరుపాడు: పెద్దవాగు ఆనకట్ట తెగిపోయి గ్రామాలన్నీ కకావికలమై సర్వస్వం కోల్పోయిన బాధితులకు రూ.3 వేల తక్షణ సాయం అందించడంలో అధికారులు పేచీలు పెడుతున్నారు. కళ్లముందే కొట్టుకుపోయిన ఇండ్లు, కట్టుబట్టలతో మిగిలిన బాధితులు, హృదయవిదారక దృశ్యాలు అధికారుల కళ్లకు కనబడుతున్నా రేషన్ కార్డు ప్రూఫ్ కావాలని అడ్డగోలు నిబంధనలు పెడుతున్నారు. రేషన్‌కార్డు ప్రూఫ్ లేకుంటే రూ.3 వేల తక్షణ సాయానికి అనర్హులని ప్రకటిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆధార్‌కార్డు ఆధారంగా వరద తక్షణ సాయంగా రూ.2 వేలు అందజేశారు. గోదావరి వల్ల జలదిగ్బంధనంలో చిక్కుకున్న ఏడు గ్రామ పంచాయతీల గ్రామాలతోపాటు, వరద ప్రభావం చూపని మేడేపల్లి, రామవరం గ్రామ పంచాయతీల్లో కూడా వరద నష్టపరిహారం రూ.2 వేల నగదు పంపిణీ చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలో అనేక నిబంధనలు విధించి తక్షణ సాయం అందకుండా కొర్రీలు పెడుతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో వరద బాధితులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. పెద్దవాగు ప్రవాహం వల్ల వాగు వెంబడి గ్రామాలన్నీ తుడిచి పెట్టుకుపోయాయి. అంతా కట్టుబట్టలతో బయటపడ్డారు. లక్షలాది రూపాయల నష్టం వాటిల్లింది.

**రేషన్ కార్డు లేక.. పరిహారం రాక**

పెద్దవాగు వల్ల మండలంలోని కమ్మరిగుడెం, అల్లూరినగర్, ఒంటిబండ, కోయమాధారం, రామవరం ఉదయ్‌నగర్, యిప్పలగుంపు, ఊటగుంపు, రాళ్ళపుడి, సొందేగొల్లగూడెం, పాతపూచిరాల, వసంతవాడ, మద్దిగట్ల, తదితర గ్రామాల్లో తీరని నష్టం వాటిల్లింది. ఒక్క కమ్మరిగూడెం గ్రామంలో మొత్తం 220 గిరిజన కుటుంబాలుండగా 48 మందికి రేషన్‌కార్డులు లేకపోవడంతో వారికి రూ.3 వేల పరిహారం నిలిపివేశారు. అల్లూరినగర్ గ్రామంలో 104 కుటుంబాలుండగా, 74 మందికి 3 వేల సాయం అందించారు. ఇక్కడ 31 మందికి రేషన్‌కార్డులు లేకపోవడంతో పరిహారం అందించలేదు. కోయమాధారంలో 186 కుటుంబాలకుగాను 25 మందికి, రామవరం ఉదయ్‌నగర్‌లో 13 కుటుంబాలకుగాను 8 మందికి, మేడేపల్లిలో 165 కుటుంబాలకుగాను 18 మందికి, రామవరం ఊటగుంపులో 45 కుటుంబాలకుగాను నలుగురికి, యిప్పలగుంపులో 93 కుటుంబాలకుగాను 7 గురికి రేషన్‌కార్డులు లేకపోవడంతో రూ.3 వేల పరిహారం ఇవ్వలేదు. ఈ గ్రామాలే కాకుండా గోదావరి వరద ముంపులో రేపాకగొమ్ము 438 కుటుంబాలున్నాయి వీరిలో 46 మందికి, తాట్కూరుగొమ్ములో 76 కుటుంబాలకుగాను 30 మందికి, వేలేరుపాడు సంతబజారు, చాకలి బజారులలో 203 కుటుంబాలకుగాను 12 మందికి రేషన్‌కార్డులు లేవు. దీంతో వీరి ఎవ్వరికీ తక్షణ పరిహారం అందలేదు.

### నాకు సాయం అందలేదు



పెద్దవాగు వల్ల మా ఇల్లు కొట్టుకుపోయింది. కట్టుబట్టలే మిగిలాయి. టార్పాలిన్ కవర్‌లో వేసిన తాత్కాలిక పాకలో నివాసముంటున్నాం. నాలుగు రోజుల భోజనం మినహా ఏ ప్రభుత్వ సాయం అందలేదు. రేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ తక్షణ సాయం రూ.3 వేలు కూడా అందించలేదు.
– కూరం రమాదేవి, అల్లూరినగర్

### ఇక్కడే పుట్టినా పరిహారం ఇవ్వలేదు



పెద్దవాగు వల్ల సర్వస్వం కోల్పోయాం. ఆధార్‌కార్డు ఉంది. ఇక్కడే పుట్టినా రేషన్‌కార్డు కోసం ఎన్ని దరఖాస్తులు పెట్టుకున్నా ఇప్పటి వరకు రాలేదు. రేషన్ కార్డు లేకపోవడం వల్ల రూ.3వేల పరిహారం అధికారులు ఇవ్వలేదు.
పద్దం రంగయ్య, అల్లూరినగర్

### ఆధార్ కార్డు సరిపోదంట



మాది అల్లూరినగర్ గ్రామం. పెద్ద వాగు వల్ల ఇల్లు పూర్తిగా కొట్టుకుపోయింది. ఆధార్‌కార్డు ఉన్నా ఆ ప్రూఫ్ సరిపోదంట. ఖచ్చితంగా రేషన్ కార్డు ఉంటేనే పరిహారం ఇస్తామని చెబుతున్నారు.
– చోదెం కుమారి, అల్లూరినగర్

### అంజన్నను దర్శించుకున్న భక్తులు


అంజన్నను దర్శించుకున్న భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయ స్వామి వారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం విశేషంగా అలంకరణ చేశారు. భక్తులు 108 ప్రదక్షిణలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారికి ఒక్కరోజు ఆదాయం రూ.1,15,111 వచ్చిందని, వెయ్యి మంది భక్తులు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు.

## మానవ అక్రమ రవాణాను నిరోధించాలి

చింతలపూడి: మానవ అక్రమ రవాణా నిరోధానికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రైవేటు జూనియర్ కళాశాలలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ పిల్లలు బాధ్యతగా చదువుకోవాలన్నారు. చదువుకునే వయసులో ప్రేమ, పెళ్లిళ్లకు దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలు ఎక్కువగా మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి మహిళ, బాలిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ ఎం సుధాకర్, ఏపీపీ సామయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వరరావు, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ అలి, న్యాయవాదులు డేవిడ్‌రాజు, భవాని, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

**అపరిచిత వ్యక్తులతో జాగ్రత్త**

కొయ్యలగూడెం: అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తతో వ్యవహరించాలని జంగారెడ్డిగూడెం బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విత్తనాల రాజు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సుకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యంగా యుక్త వయసు బాలికలు ఎవరినీ నమ్మి మోసపోవద్దన్నారు. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని, తమపై జరిగే దాడులు, అఘాయిత్యాల వివరాలను వెంటనే తల్లి తండ్రులకు, సంబంధిత అధికారులకు తెలియజేయాన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు మేకల రామ్మోహన్‌రావు, బండారు లతాకుమారి, పిల్లి పెద్దిరాజు, బొడ్డు వాసు, ఐసీడీఎస్ పీవో యూఎన్ స్వర్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.


చింతలపూడి: విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు


కొయ్యలగూడెం: మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న విత్తనాల రాజు

## వ్యవసాయానికి ఉపాధి హామీ నిధులు పెంచాలి


స్థానిక చెక్‌పోస్ట్ సెంటర్లో రాస్తారోకో నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘ సభ్యులు

కామవరపుకోట: కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీకీ, వ్యవసాయ రంగానికి నిధులు కోత విధించడం దుర్మార్గమని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.రవి అన్నారు. మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కామవరపుకోట కొత్తూరు చెక్‌పోస్ట్, ఏలూరు రోడ్లోపై రాస్తారోకో నిర్వహించి కేంద్ర బడ్జెట్ పత్రులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో పేదలకు, వ్యవసాయ కార్మికులకు తీవ్రంగా అన్యాయం చేశారని, రోజు వారి వ్యవసాయ పనులు చేసుకునే పేదలకు, ఉపాధి హామీ కూలీలకు నిధులు కేటాయింపు సరిగా లేవన్నారు. నిధులు కోత విధించడంతోపాటు పేదలకు అన్యాయం చేసేలా బడ్జెట్ ప్రవేశపెట్టారని మండిపడ్డారు. వ్యవసాయ రంగాన్ని ప్రైవేటు కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెట్టాలా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాలని బడ్జెట్లో నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు జె.సత్యనారాయణ, తామ ముత్యాలమ్మ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ, జిల్లా నాయకులు మహంకాళిరావు, ప్రభాకరరావు, గవర సత్యనారాయణ, సీత, హోలీ మేరీ, చంటి తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలపై అవగాహన తప్పనిసరి



రాజానగరంలో బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: బాల్య వివాహాలపై విద్యార్థులు తప్పనిసరిగా పూర్తి అవగాహన కలిగి ఉండాలని జెడ్పీటీసీ మొడియం రామతులసి అన్నారు. రాజానగరం హైస్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం బాల్య వివాహాల నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయసులోనే వివాహం చేయడం వలన అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. విద్యార్థులు చదువుతోపాటు పరిశుభ్రత, పౌష్టికాహారంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్‌వీ సత్యవతి మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షిద్దాం.. ఆడపిల్లలను చదివిద్దాం అనే నినాదంతోపాటు బాల్య వివాహాలపై 100 రోజుల అవగాహన సదస్సులను పాఠశాలలో నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కె. దుర్గమ్మ, హెచ్ఎంలు వెంకమ్మ, గంగారత్నం, ఏఎన్ఎంలు కె. వెంకటలక్ష్మి, కె. మంగతయారు అంగన్‌వాడీ టీచర్‌లు, పుష్ప, సుజాత, జ్యోతి, అనంత కుమారి, దుర్గాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్ కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగమణి

బుట్టాయగూడెం: జీలుగుమిల్లిలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ మండల కమిటీ సమావేశం మంగళవారం ఆ కమిటీ నాయకురాలు అనసూయ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా కార్యదర్శి మొడియం నాగమణి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం ప్రపంచంలోనే చాలా ప్రాధాన్యత గల పథకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పలు చెప్తున్నాయని అన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం బడ్జెట్ కేటాయించాలని, కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని ఆమె కోరారు. అలాగే ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు భోజనం వంట చేసేందుకు ప్రభుత్వమే గ్యాస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, రాజకీయ వేధింపులను ఆపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు కొండలరావు, రోశమ్మ, పి.వెంకటేశ్వరి, కమల, తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌సీ కుటుంబానికి ఆర్థిక సాయం

ఏలూరు టౌన్: ఏఆర్ హెచ్‌సీ తెల్లం చంద్రరావు అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు హనుమాన్‌నగర్ ప్రాంతంలో చంద్రరావు స్వగృహానికి వెళ్లి ఆయన భౌతికకాయం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్ చేతులమీదుగా చంద్రరావు కుటుంబానికి రూ.25 వేలు, ఫ్లాగ్ ఫండ్ నుంచి రూ.25 వేలు, విడోఫండ్ నుంచి రూ.50 వేల చెక్‌లను అందజేశారు. చంద్రరావు కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీహరిరావు, అడ్మిన్ ఆర్ఐ భావన కుమార్, ప్లాటూన్ ఆర్ఎస్ఐ శంకర్, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు ఆర్ నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ శానం రమేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

# 52 శాతం వరినాట్లు పూర్తి


జంగారెడ్డిగూడెంలో దమ్ము చేస్తున్న వరి పొలాలు


నాట్లు వేసిన వరి పొలాలు

**వ్యవసాయ పనుల్లో రైతులు బిజీబిజీ**

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలో 52 శాతం వరినాట్లు పూర్తయ్యాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు వరినాట్లు వేగవంతం చేశారు. దీంతో అధిక శాతం వరినాట్లు పూర్తయ్యాయి. కేఆర్‌పురం వ్యవసాయ డివిజన్ పరిధిలో జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం, కుక్కునూరు, పోలవరం, వేలేరుపాడు మండలాలు ఉండగా, ఈ మండలాల్లో సాధారణ వరి నారు విస్తీర్ణం 1876 ఎకరాలకుగాను 1584 ఎకరాల్లో నారుమడులు వేశారు. అలాగే డివిజన్ పరిధిలో 37,527 ఎకరాల్లో వరి విస్తీర్ణం ఉండగా, ఇప్పటి వరకు 19,432 ఎకరాల్లో వరి నాట్లు పడ్డాయి.

**మండలాల వారీగా..**

జంగారెడ్డిగూడెం మండలంలో సాధారణ వరి విస్తీర్ణం 12978 ఎకరాలకుగాను ఇప్పటివరకు 9,800 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయి. అలాగే బుట్టాయగూడెం మండలంలో 4,369 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా, 517 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. జీలుగుమిల్లి మండలంలో 2,800 ఎకరాలకుగాను 75 ఎకరాల్లో, కొయ్యలగూడెం మండలంలో 9,074 ఎకరాలకు గాను 4,200 ఎకరాల్లో, కుక్కునూరు మండలంలో 1075 ఎకరాలకు గాను, 100 ఎకరాల్లో, పోలవరం మండలంలో 5,668 ఎకరాలకు గాను 4,270 ఎకరాల్లో, వేలేరుపాడు మండలంలో 1544 ఎకరాలకు గాను, 70 ఎకరాల్లో వరినాట్లు పూర్తయ్యాయి. అత్యధికంగా జంగారెడ్డిగూడెం, పోలవరం మండలాల్లో వరినాట్లు పూర్తయ్యాయి. ఇక కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో తక్కువ శాతం నమోదయ్యాయి.

### ఆగస్టు 15లోగా వరినాట్లు పూర్తి చేసుకోవాలి



వరినాట్లు పైపేర నాటుకోవాలి. వరినాట్లు నాటిన మూడవ రోజు తరువాత కలుపు మందు పిచికారీ చేయాలి. కలుపుమందు వేసే సమయంలో మడుల్లో నీరు తక్కువగా ఉండేలా చూసుకోవాలి. డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 52 శాతం నాట్లు పూర్తయ్యాయి. యాజమాన్య పద్ధతులు పాటించాలి.
– పీజీ బుజ్జిబాబు, ఏడీఏ

### టీడీపీ కార్యకర్తపై చర్యలు తీసుకోవాలి

కామవరపుకోట: సత్యసాయి జిల్లా ఓడిచెరువు మండలం నారసింపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ వర్కర్ సుహాసినీని లైంగికంగా వేధిస్తూ ఆమెపై దాడి చేసిన టీడీపీ కార్యకర్త ఆంజనేయులుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా గౌరవ అధ్యక్షుడు టీవీఎస్ రాజు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రోజురోజుకు మహిళలపై లైంగిక వేధింపులు, వరకట్న వేధింపులకు అడ్డుకట్ట వేసేందుకు హోంమంత్రి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. టీడీపీ కార్యకర్త ఆంజనేయులను అరెస్టు చేసి సుహాసినీకి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

### యుద్ధప్రాతిపదికన రహదారి మరమ్మతులు

జంగారెడ్డిగూడెం రూరల్: ఇటీవల సంభవించిన వర్షాలకు మండలంలో ధ్వంసమైన రహదారులను జంగారెడ్డిగూడెం ఎంపీడీవో కె.విజయప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వేగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు ధ్వంసమైందని, రహదారి మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసినట్లు తెలిపారు. మండలంలో ధ్వంసమైన రహదారుల మరమ్మతులు పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగరాజు, ఎంపీటీసీ సత్యనారాయణ పాల్గొన్నారు.

### పుంత రోడ్డు ఆక్రమణల తొలగింపు


పుంతరోడ్డు సరిహద్దులను నిర్ణయిస్తున్న అధికారులు

జంగారెడ్డిగూడెం రూరల్: పుంతరోడ్డు ఆక్రమణలను అధికారులు మంగళవారం తొలగించారు. దీనికి సంబంధించి తహసీల్దార్ కె.స్లీవజోజి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వేగవరానికి చెందిన పల్లంట్ల నారాయణస్వామికి రామచర్లగూడెం రెవెన్యూలో 3.30 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలోకి వెళ్లడానికి 12/1సిలో ప్రభుత్వ పుంత దారి ఉంది. సరిహద్దు రైతు తూంపాటి రాంబాబు పుంతను ఆక్రమించి కొబ్బరి మొక్కలు వేశాడు. దీంతో పొలానికి వెళ్లేందుకు ఇబ్బందులు కలుగుతున్నాయని, ఆక్రమణలు తొలగించాలని నారాయణస్వామి హైకోర్టును ఆశ్రయించగా, పుంత ఆక్రమణలు తొలగించాలని ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో పుంత సరిహద్దుదారులు, ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో రాంబాబు, సుబ్బాయమ్మ పుంతదారిలో ఉన్న కొబ్బరి, నిమ్మ మొక్కలను తొలగించకపోవడంతో నారాయణ స్వామి మంగళవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ కె.స్లీవజోజి, ఎంపీడీవో విజయప్రసాద్, ఎస్సై జి.జ్యోతిబాస్, మండల సర్వేయర్, ఆర్ఐ, రెవెన్యూ సిబ్బందితో కలిసి సరిహద్దు రైతులు, పల్లంట్ల నారాయణస్వామి సమక్షంలో ఆక్రమణలను తొలగించారు.

### ఆటో డ్రైవర్ల సంక్షేమానికి పోరాడుదాం

ఏలూరు (టూటౌన్): ఆటో డ్రైవర్ల సంక్షేమానికి సమరశీల పోరాటాలు చేస్తామని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జె.గోపి అన్నారు. స్థానిక పాతబస్టాండ్ సెంటర్ త్రిచక్రం ఆటో డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) అధ్యక్ష ఎన్నికలు స్థానిక ఆటో స్టాండ్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో గెలిచిన అద్దాల రాజు (నాని)కి జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జె.గోపి, ఉపాధ్యక్షుడు చక్రాల అమర్ కుమార్ అభినందనలు తెలిపారు. ఆటో డ్రైవర్లకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇ చలానాలు రద్దు చేయాలని, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికులకు ఉరితాడులా మారిన బీఎన్ఎస్ 106 (1, 2)లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కోలా రాజు, బి.త్రినాథ్, శివ, బొడ్డేపల్లి చంద్ర శేఖర్, మాత్రపు రమేష్ పాల్గొన్నారు.